క్లుప్తంగా

సీతమ్మధార రైతుబజార్ స్టాళ్లకు డ్రా



రైతులకు స్టాల్ టోకెన్ అందిస్తున్న మార్కెటింగ్ అధికారి యాసిన్

సీతమ్మధార: స్థానిక రైతుబజార్‌లోని స్టాళ్లకు ఆదివారం డ్రా తీశారు. మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్ రైతులకు స్టాల్ నంబర్ టోకెన్లు అందజేశారు. ఉదయం 86 మంది కార్డుదారులకు సంబంధించి 63 స్టాళ్లకు, సాయంత్రం 74 మంది కార్డుదారులకు సంబంధించి 63 స్టాళ్లకు డ్రా తీసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, రైతులు పాల్గొన్నారు.

సామాన్యులపై ధరల భారం తగదు



ప్రచారం చేస్తున్న సీపీఐ నాయకులు

సీతంపేట: ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్న ప్రధాని నరేంద్రమోదీని గద్దె దింపి దేశాన్ని రక్షించాలని సీపీఐ నాయకుడు జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీల ప్రచార భేరి కార్యక్రమాన్ని ఆదివారం రామా టాకీస్ సమీపంలోని శ్రీనగర్, వినాయకనగర్ ప్రాంతాల్లో నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు సామాన్యులపై ధరల భారం మోపుతూ.. మరోవైపు బడా కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వరంగ సంస్థలను కట్టబెడుతున్నారని విమర్శించారు. నిత్యావసర సరకులు, ఇంధన ధరలను అదుపుచేసి ప్రజలకు ఆహార భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు రావి కృష్ణ, ఆటో సంఘం నాయకులు కె.గోవిందరాజు, సిహెచ్.యొహన, కనకరాజు, కె.రాము, పి.శ్రీను, జి.రమేష్ పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ అందిస్తున్న లలితా పీఠం ప్రతినిధులు

సీతంపేట: లలితా నగర్ లలితా పీఠం ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేస్ ప్రారంభించి, భక్తులు, పాదచారులకు మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి ఆశీస్సులతో చలివేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వైశాఖ శుద్ధ తదియ నుంచి అమావాస్య వరకు ప్రతి రోజూ చల్లని మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు.

బాబోయ్ దుర్వాసన..!



సీతమ్మధార రైతుబజార్ రోడ్డులో డంపర్ బిన్ వద్ద చెత్త కుప్పలు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్ వద్ద రహదారిలో పేరుకుపోయిన చెత్త నుంచి భరించలేని దుర్వాసన వెలువడుతోందని స్థానికులు, పాదచారులు వాపోతున్నారు. ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని చెబుతున్నారు. రైతుబజార్ వద్ద రోడ్డులో ఏర్పాటు చేసిన డంపర్ బిన్ చెత్తతో నిండిపోయి, దాని చుట్టూ వ్యర్థాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. పశువులు, కుక్కలు చెత్తను తింటూ లాగిపడేస్తున్నాయి. దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. కొందరు డంపర్ బిన్‌లో చెత్త వేయకుండా రోడ్డుపైనే పడేస్తున్నారు. జీవీఎంసీ పారిశుధ్య అధికారులు స్పందించి సకాలంలో చెత్త తొలగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

చెత్తను తగలబెట్టేస్తున్నారు..



సుభాష్‌నగర్‌లో డస్ట్ బిన్ వద్ద తగలబెడుతున్న చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు, వైర్లు



గొల్ల కంచరపాలెం రైల్వే ట్రాక్ ప్రాంతంలో వ్యాపిస్తున్న పొగ

- కంచరపాలెం పరిధిలో వ్యర్థాలకు నిప్పు
- పొగతో ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహన చోదకులు
- దృష్టి సారించని అధికారులు

కంచరపాలెం: జీవీఎంసీ 56, 57 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో చెత్తను ఇష్టానుసారంగా తగలబెట్టేస్తున్నారు. డంపింగ్ యార్డుకు తరలించాల్సిన చెత్త, ఇతర వ్యర్థాలను రహదారులపై, ఎక్కడ పడితే అక్కడ నిప్పు పెట్టి వదిలేస్తున్నారు. ఆ మంటల నుంచి వ్యాపిస్తున్న దట్టమైన పొగతో స్థానిక ప్రజలు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కంచరపాలెం రైల్వే ట్రాక్ రోడ్డు, సుభాష్‌నగర్ రైల్వే వంతెన రహదారులు ఎప్పుడు చూసినా పొగ మంటలతో నిండి ఉంటున్నాయి. 56వ వార్డు గొల్ల కంచరపాలెం నుంచి దుర్గానగర్‌కు వెళ్లే గెడ్డలను ఆనుకుని ఉన్న రైల్వే ట్రాక్ రహదారిలో స్థానిక ఇళ్ల నుంచి వేసే చెత్తను, 57వ వార్డు ఊర్వశి కూడలి సుభాష్‌నగర్ రైల్వే వంతెన రహదారుల్లో శానిటరీ డస్ట్ బిన్ల వద్ద చెత్తను తగలేస్తున్నారు. స్క్రాప్ దుకాణాలు, వాహనాల మరమ్మతుల షెడ్లతో ఈ రహదారులు కాలుష్యంతో నిండిపోతున్నాయి. పలు ప్రాంతాల నుంచి తెచ్చిన వ్యర్థాలను ఇక్కడి బహిరంగ ప్రదేశాల్లో దహనం చేస్తున్నారు. వాటి నుంచి దుర్గంధం వెలువడుతుండటంతో వాసన భరించలేక శ్వాసకోశ వ్యాధులు ప్రబలుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. దట్టమైన పొగల కారణంగా రాకపోకల సమయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ద్విచక్ర వాహన చోదకులు చెబుతున్నారు.

అల్లరిమూకల ఆగడాలు.. నిత్యం బయట ప్రాంతాల నుంచి తెచ్చిన చెత్తను ఇక్కడే కుప్పలుగా పోగు చేస్తున్నారు. దీంతో స్థానిక ప్రాంతాలు డంపింగ్ యార్డ్‌గా మారిపోయాయి. రైల్వే ట్రాక్‌ను ఆనుకుని ఉన్న స్థలంలో చెత్తకు ఆకతాయిలు నిప్పు పెడుతున్నారని వార్డు శానటరీ సిబ్బంది చెబుతున్నారు. పెట్రోల్ దొంగతనాలు చేసే అల్లరిమూకలు విద్యుత్, కేబుల్ వైర్లు ఇక్కడే కాల్చుతున్నారు. దీంతో కాలుష్య కారక వాయువులు వెలువడుతున్నాయని స్థానికులు భయాందోళనలు వెలువడుతున్నాయి. ఈ సమస్యపై గతంలో అనేక సార్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యమని ఆరోపిస్తున్నారు. జోన్-5 పబ్లిక్ హెల్త్ అధికారులు దృష్టి సారించి చెత్తను తగలేస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాలవాసులు కోరుతున్నారు.

సమాచారమ్

ప్రజా సేవలో జోన్-5 అధికారులు



జ్ఞానాపురంలోని జోన్-5 కార్యాలయం

కంచరపాలెం: జీవీఎంసీ జోన్-5 అధికారులు ప్రజలకు సేవలందించేందుకు అందుబాటులో ఉన్నారు. జోన్ పరిధి ఉత్తర, పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించి 40 నుంచి 63 వరకు మొత్తం 24 వార్డులు ఉన్నాయి. సమాచార హక్కు చట్టం-2005 ప్రకారం అధికారులు పౌర సమాచారం అందిస్తారు. జోన్ పరిధిలో సమస్యలు, సందేహాలపై ఫిర్యాదులు చేయడానికి, ఏదైనా ఉపయోగకర సమాచారం తెలుసుకోవడానికి కింద పేర్కొన్న అధికారుల నంబర్లకు కాల్ చేయవచ్చు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో జోన్ ప్రజలు తమ సమస్యలపై అధికారులకు నేరుగా వినతిపత్రాలు అందజేయవచ్చు.

జీవీఎంసీ జోన్-5 అధికారుల వివరాలు

అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
ఆర్.జి.వి.కృష్ణ	జోనల్ కమిషనర్(జెడ్సీ) ప్రథమ అప్పిలేట్ అధికారి	97050 86888
టి.ఎస్.ఎస్.రాజు	సూపరింటెండెంట్-1 (రెవెన్యూ, ఇంజినీరింగ్, ఎస్టాబ్లిష్‌మెంట్)	99481 25699
ఆర్.వి.రమణ	సూపరింటెండెంట్-2 (టౌన్‌ప్లానింగ్, పబ్లిక్ హెల్త్, యూసీడీ)	99897 84585
ఎ.శ్రీనివాస్	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్-1(ఉత్తర)	99480 78507
టి.ప్రసన్నరెడ్డి	ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్-2(పశ్చిమ)	79979 54406
డాక్టర్ ఎ.రాజేష్	పబ్లిక్ హెల్త్ (అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్)	99480 95520
ఐ.వి.రమణమూర్తి	అసిస్టెంట్ సిటీ ప్లానర్ డీమ్డ్ పీఐవో	81878 99199
శ్రీలక్ష్మి	టౌన్ ప్లానింగ్ టీపీవో	70932 87310
కె.పద్మావతి	ఏపీడీ(యూసీడీ)	97013 85284
ఆర్.బాబూరావు	రెవెన్యూ కమిషనర్	98481 70067

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్



ద్వారకా స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ ధర్మేంద్ర



ఫోర్త్‌టౌన్ పీఎస్‌లో రౌడీ షీటర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ వెంకటరావు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లకు సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎస్ఐ వెంకటరావు కౌన్సెలింగ్ నిర్వహించి వేలిముద్రలు సేకరించారు. ఈ సందర్భంగా రౌడీ షీటర్లతో ఎస్ఐ మాట్లాడుతూ నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని హితవు పలికారు. ఎటువంటి నేరాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తించుకుని మంచిగా నడుచుకోవాలని సూచించారు. పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా పీఎస్‌లో..

ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు సీఐ సింహాద్రినాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ నిర్వహించారు. తగాదాల్లో తలదూర్చితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గొడవలకు దూరంగా ఉంటూ మంచిగా జీవించాలని సూచించారు. అనంతరం రౌడీ షీటర్లను వారి ఇంటి వద్ద అప్పగించి వచ్చారు.

సమాజానికి దిక్సూచి అంబేడ్కర్

సీతంపేట: నవ భారత నిర్మాణానికి, దేశ ప్రజల సౌభ్రాతృత్వానికి, సమాజానికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ దిక్సూచి అని ఎల్ఐసీ సీనియర్ డివిజనల్ మేనేజర్ సుధాకర్ అన్నారు. జైభీం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన అంబేడ్కర్ 132వ జయంతి వేడుకల్లో ఆయన ప్రసంగించారు. బాబా సాహెబ్ జీవితానికి సంబంధించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. వికలాంగ సంక్షేమ విశ్రాంత అధికారి జీవన్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా చైర్మన్ సన్‌మూర్తి, ఎల్ఐసీ అధికారి విజయ్‌కుమార్, రామకృష్ణ, ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శ్రీరామమూర్తి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఎస్.ఈశ్వర్‌రావు, సబ్బవరపు శ్రీరామమూర్తి అనే ఇద్దరు వ్యక్తులు నగరంలోని ఆరిలోవలో నివసిస్తున్నారు. వీరు కార్పెంటర్ పని చేస్తుంటారు. వీరిద్దరు ఆదివారం ఉదయం సింహపురి కాలనీలో పనిచేయడానికి యాక్టివా స్కూటీపై ఊర్వశి జంక్షన్ నుంచి బిర్లా కూడలికి వస్తున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారు. వారు పాత్రా ఇండియా కంపెనీ వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి ఒడిశాకు చెందిన లారీ ఢీకొనడంతో డ్రైవ్ చేస్తున్న శ్రీరామమూర్తి తలకు గాయాలయ్యాయి. వెనుక కూర్చున్న ఈశ్వర్‌రావుకు చిన్న చిన్న గాయాలవడంతో వారిద్దరిని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సీఐ విజయ్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

అలివేలు మంగమ్మ భవంతిలో అన్నసమారాధన ప్రారంభం



భక్తులకు వంటకాలు వడ్డిస్తున్న సమన్వయకర్త కె.కె.రాజు, కార్పొరేటర్ అల్లు శంకరరావు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ప్రారంభించిన అలివేలు మంగమ్మ అన్నసమారాధన భవంతిలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు, 49వ వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావుతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వెయ్యి మందికి 13 రకాల కూరలతో కూడిన రుచికరమైన వంటకాలను వడ్డించారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు వైభవుడి సన్నిధిలో నిర్వహించే అన్నసమారాధన ప్రాశస్త్యాన్ని వివరించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉత్సాహంగా నడక పోటీలు



పోటీ పడుతున్న మహిళలు



నడక పోటీల్లో పాల్గొన్న వాకర్స్

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం వైశాఖి స్పోర్ట్స్ పార్కులో వాకర్ ఆదినారాయణ స్మారక నడక పోటీలు ఉత్సాహంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్.వెంకట సుధాకర్ వీటిని ప్రారంభించారు. పోటీల్లో 102 మంది పాల్గొనగా.. వీరిలో 42 మంది మహిళలు ఉన్నారు. 31-40, 41-50, 51-60, 61-70, 71-80, 81-90 వయసుల వారీగా విభజించి మహిళలు, పురుషులకు ప్రత్యేకంగా పోటీలు జరిపారు. ప్రతి విభాగం నుంచి మొదటి మూడు స్థానాలకు ఎంపిక చేశారు. విజేతలకు మే 1న నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో బహుమతులు అందిస్తారు. ఈ పోటీల్లో వైశాఖీ స్పోర్ట్స్ పార్కు, త్రీస్టార్ వాకర్స్ క్లబ్, హెల్దీ వాకర్స్ క్లబ్, వనితా వాకర్స్ క్లబ్, మా వాకర్స్ క్లబ్, యూనివర్సల్ హెల్త్‌క్లబ్, ఇతర వాకర్స్ పాల్గొన్నారు. వీరికి ఉదయం ఫలహారాలు అందించారు.

విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



విద్యార్థులు వేసిన చిత్రాలు

మురళీనగర్: మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఆదివారం ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హెచ్ఎం బి.హేమలత పర్యవేక్షణలో నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని చక్కని చిత్రాలు వేశారు.

కనకమ్మ పండగ కరపత్రం ఆవిష్కరణ



ఆలయంలో కరపత్రం ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట గ్రామదేవత కనకమ్మ అమ్మవారి పండగ మహోత్సవ కరపత్రాన్ని ఆదివారం ఆలయంలో ముఖ్య అతిథి కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆవిష్కరించారు. జూన్ 12న తొలేళ్లు, 13న ప్రధాన పండగ జరుగుతాయని కమిటీ పేర్కొంది. ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్చకుడు శివగణేష్, గౌరవాధ్యక్షుడు ఇసరపు అప్పారావు, గ్రామ సంఘం అధ్యక్షుడు బోర ఈశ్వరరావు, కార్యదర్శి సారిపిల్లి గంగరాజు, బోర రమణ, సానబోయిన సురేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మధురానగర్ ఏఏ గ్రూప్‌గా నామకరణ..

స్థానిక మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో ఆదివారం ఆల్కలిక్ ఎనానిమస్ నామకరణ కార్యక్రమం నిర్వహించారు. 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ మధురానగర్ ఏఏ గ్రూప్‌గా నామకరణం చేసి ఆవిష్కరించారు. బి.రాంబాబు, డి.గోవింద్, ఇ.గోవింద్, సీల శ్రీను, బొట్ట ఆనంద్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం..

యశోద కృష్ణా సేవా సంఘం ఆధ్వర్యంలో సీతంపేట కూడలిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కాస్మోలైఫ్ యూనివర్సల్ సంస్థ 14 రకాల టెస్టులు ఉచితంగా చేసింది.

ఆటో స్టాండు ప్రారంభం..

స్థానిక గణేష్‌నగర్ సత్యం కూడలిలో ఏర్పాటు చేసిన శ్రీలక్ష్మీ గణపతి ఆటో యూనియన్ స్టాండ్‌ను కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ప్రారంభించారు.

పుస్తకం.. మంచి నేస్తం



పిల్లలతో పుస్తకాలు చదివిస్తున్న గ్రంథాలయ సంఘ అధ్యక్షుడు దత్తి అప్పలనాయుడు

మురళీనగర్: పుస్తకాన్ని మించిన నేస్తం మరొకటి ఉండదని విశాఖ జిల్లా గ్రంథాలయ సంఘం అధ్యక్షుడు దత్తి అప్పలనాయుడు అన్నారు. మురళీనగర్ మహిళలు, పిల్లల గ్రంథాలయంలో ఆదివారం ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా వ్యక్తిత్వ వికాసం పొందవచ్చన్నారు. మనం తలదించుకొని పుస్తకాన్ని చదివితే మనల్ని తలెత్తుకుని జీవించే విధంగా ధైర్యాన్ని ఇస్తుందని చెప్పారు. ధన సంపద కన్నా.. జ్ఞాన సంపద గొప్పదని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతి రోజు ఒక పుస్తకాన్ని చదవాలని సూచించారు. ఈ సందర్భంగా పిల్లలకు కథలు చెప్పి, వాటిని చదివించారు. పిల్లలకు పద్యపఠన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వై.పద్మజ, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

మేలో ఇండో-నేపాల్ కరాటే టోర్నీ



కరాటే చాంపియన్‌షిప్ పోటీల బ్రోచర్ ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్, ఉషశ్రీ

అక్కిరెడ్డిపాలెం: మే 26, 27, 28 తేదీల్లో స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో దూ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏపీ వాడో-ర్యూ కరాటే ప్రథమ ఇండో-నేపాల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నట్లు 43వ వార్డు కార్పొరేటర్(ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి), పోటీల నిర్వహణ చైర్‌పర్సన్ పి.ఉషశ్రీ తెలిపారు. 68వ వార్డు మిందిలో ఆదివారం కరాటే పోటీల బ్రోచర్‌ను రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉషశ్రీ మాట్లాడుతూ ఈ పోటీల్లో నేపాల్ దేశం నుంచి 150 మందికి పైగా కరాటే క్రీడాకారులు, అఫీషియల్స్ హాజరు కానున్నట్లు చెప్పారు. మన దేశ నలుమూలల నుంచి 15 రాష్ట్రాలకు చెందిన 2,500 మంది కరాటే క్రీడాకారులు, అఫీషియల్స్ పాల్గొంటారన్నారు. ఈ పోటీలను ఏపీ వాడో-ర్యూ అసోసియేషన్ చైర్మన్ బొగ్గు శ్రీను, కె.రంగరాజు, విశ్రాంత ఏసీబీ డీఎస్పీ, సబ్ రిజిస్ట్రార్ కె.రాజు సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ టాలెంట్ స్కూల్ చైర్మన్ కె.బ్రహ్మారెడ్డి, ఎస్.కె.గులాం, అసోసియేషన్ కార్యదర్శి జి.గోపాలరావు, కోశాధికారి బి.వెంకటరావు, కో ఆర్డినేటర్ ఎం.హరినాథరావు, వి.అప్పలరాజు, సీనియర్ కోచ్‌లు పాల్గొన్నారు.

'కథా పరిమళాలు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ పెద వీర్రాజు తదితరులు

సీతంపేట: కథకులు తమ చుట్టూ ఉన్న సమాజం నుంచి కథా వస్తువును తీసుకున్నంత కాలం తెలుగు కథలోని తెలుగుదనానికి కీడు వాటిల్లదని కవి, వైద్య నిపుణుడు ఈదర పెద వీర్రాజు అన్నారు. ఎస్.కె.బాబు సంపాదకత్వంలో 56 మంది రచయితల 56 కథల సంకలనం 'కథా పరిమళాలు' పుస్తకాన్ని ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆయన ఆవిష్కరించారు. విశాఖ రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అడపా రామకృష్ణ సభాధ్యక్షత వహించారు. విశ్రాంత తెలుగు విభాగాధిపతి మరడాన సుబ్బారావు, ఎస్.హనుమంతరావు పుస్తకాన్ని సమీక్షించారు. కార్యక్రమంలో చీఫ్ ఇమ్మిగ్రేషన్ అధికారి డి.శ్రీహరిరాజు, మేడా మస్తాన్ రెడ్డి, సర్వేశ్వరశాస్త్రి, శిరేల సన్యాసిరావు, పరమేశ్వరరావు, చిన్ని రెడ్డి పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఆరిలోవ: యోగాతో ప్రతి మనిషికి సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఆనంద్ మార్గ్ ఆశ్రమ స్వామీజీ సౌమ్యానంద్ అవధూత అన్నారు. ముడసర్లోవ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్కిల్ డెవెలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ వద్ద జీవీఎంసీ ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో ఆదివారం ఉచిత యోగా శిబిరం నిర్వహించారు. ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు జరిగిన ఈ శిబిరంలో వాకర్స్ క్లబ్ సభ్యులతోపాటు స్థానికులు వివిధ యోగాసనాలు నేర్చుకున్నారు. ఈ సందర్భంగా సౌమ్యానంద్ అవధూత మాట్లాడుతూ యోగాలో ఏ ఆసనం వల్ల ఎలాంటి ఉపయోగం కలుగుతుందో వివరించారు. ప్రస్తుతం వాతావరణంలో వచ్చిన మార్పులు, పరిస్థితుల కారణంగా మనిషికి కలుగుతున్న ఒత్తిడి, అనారోగ్యం కుదుటపడడానికి యోగా సాధన మంచి ఔషధం లాంటిదన్నారు.

త్వరలో అందుబాటులోకి ఆరోగ్య కేంద్రం



ఆరోగ్య కేంద్రంలో పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంకల కవిత

కంచరపాలెం: త్వరలో వార్డు ప్రజలకు వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందుబాటులోకి వచ్చేలా పనుల వేగవంతానికి కృషి చేస్తానని 48వ వార్డు కార్పొరేటర్ గంకల కవిత తెలిపారు. వార్డులోని ఇందిరానగర్ కొండవాలు ప్రాంతంలో జరుగుతున్న ఆరోగ్య కేంద్రం పనులను ఆదివారం ఆమె పరిశీలించారు. ఇక్కడ నూతనంగా నిర్మిస్తున్న అర్బన్ హెల్త్‌కేర్ సెంటర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం జైభారత్‌నగర్ శ్మశానవాటికలో రూ.48 లక్షలతో నిర్మిస్తున్న ప్రధాన డ్రైనేజీ పనులను కార్పొరేటర్ పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు, జీవీఎంసీ అధికారులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.